# సాక్షి ఆదిలాబాద్

మంగళవారం | 18 | మార్చి | 2025






**నీటితడి లేక కంటతడి!** 9లో▸

ఎన్నో కష్టనష్టాలకోర్చి సాగు చేసిన పంటలు చివరిదశలో నీటి తడులందక ఎండిపోతుండడంతో రైతులు కంటతడి పెడుతున్నారు.



**రంజాన్ వేళలు**

| ఇఫ్తార్ | సహర్ |
|---|---|
| మంగళవారం : 6:22 | బుధవారం : 5:05 |

గరిష్టం/కనిష్టం 38.0/25.0

**వాతావరణం**

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరగనుంది. ఉక్కపోత ప్రభావం కనిపించనుంది.

## న్యూస్‌రీల్

### జిల్లా జడ్జిని కలిసిన ఎస్పీ



జిల్లా జడ్జికి పూలమొక్క అందజేస్తున్న ఎస్పీ

ఆదిలాబాద్‌టౌన్: ఇటీవల నూతన ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన అఖిల్ మహాజన్ సోమవారం జిల్లా జడ్జి ప్రభాకరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. కోర్టులో కలిసి పూల మొక్క అందజేశారు. అలాగే అదనపు జిల్లా సెషన్స్ జడ్జి డాక్టర్ పి.శివరాంప్రసాద్‌ను సైతం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారితో పెండింగ్ కేసుల వివరాలపై చర్చించారు. రానున్న లోక్ అదాలత్‌పై దృష్టి సారించి బాధితులకు సత్వర న్యాయం చేసేలా కృషి చేయాలని పేర్కొన్నారు. .

**అసాంఘిక కార్యకలాపాలు అరికట్టాలి**

బేల: సరిహద్దుల్లో అసాంఘిక కార్యకలాపాలు అరికట్టాలని, అక్రమ రవాణాకు పూర్తిగా అడ్డుకట్ట వేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సాత్నాల ప్రాజెక్టును సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం చేకూరేలా కృషి చేయాలని ఎస్సైలు దివ్యభారతి, ముజహిద్‌కు సూచించారు. ఆయన వెంట ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి, సీఐలు ఫణిదర్, సాయినాథ్, తదితరులున్నారు.

### కుష్టు నివారణకు చర్యలు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

ఆదిలాబాద్‌టౌన్: కుష్టును ప్రారంభ దశలో గుర్తించి చికిత్స పొందితే అంగవైకల్యం రాదని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ అన్నారు. పట్టణంలోని శాంతినగర్ అర్బన్ పీహెచ్‌సీ పరిధిలో సోమవారం కుష్టు గుర్తింపు సర్వే ప్రారంభించారు. ముందుగా ఏర్పాటు చేసిన సమావేశంలో సిబ్బందికి పలు సూచనలు చేశారు. కుష్టు పోస్టర్లు, అవగాహన పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు సోమవారం నుంచి 15 రోజుల పాటు సర్వే నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇంటికి వచ్చే సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు. సర్వే నిమిత్తం జిల్లాలోని 22 పీహెచ్‌సీ, ఐదు అర్బన్ హెల్త్ సెంటర్ల పరిధిలో 1002 బృందాలను ఏర్పాటు చేశామని, వీరిని పర్యవేక్షించడానికి 200 మంది సూపర్‌వైజర్లను నియమించామన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి గజానన్, అర్బన్ పీహెచ్‌సీ వైద్యులు వినోద్, డీపీఎంవో వామన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# కొత్త చెరువుల ఊసేది?

- ఏళ్ల క్రితం నిర్మాణానికి ప్రతిపాదనలు
- భూసేకరణకు నిధులు కూడా మంజూరు
- ఆయకట్టు అభివృద్ధికి ప్రణాళికలు
- దశాబ్దం దాటినా పడని అడుగు
- రైతులకు తప్పని ఎదురుచూపు

| చెరువుల వివరాలు (ఉమ్మడి జిల్లాలో).. |
|---|
| పథకం : మిషన్ కాకతీయ |
| మంజూరైన చెరువులు : 46 |
| ఆయకట్టు అభివృద్ధి అంచనా : సుమారు 25వేల ఎకరాలు |
| స్టేజ్–1లో అప్పట్లో మంజూరైన(విడుదల కాని)నిధులు: సుమారు రూ.110 కోట్లు |



ఇది గుడిహత్నూర్ మండలం కమలాపూర్ గ్రామంలో చెరువు నిర్మాణం కోసం కేటాయించిన స్థలం. ఏళ్ల క్రితం ఇక్కడ చెరువు నిర్మిస్తామని చెప్పారు. రూ.26 కోట్లతో అంచనా వేశారు. సుమారు 1,450 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ లక్ష్యంగా పేర్కొన్నారు. దీంతో అన్నదాతల్లో హర్షం వ్యక్తమైంది. యాసంగిలో ఈ చెరువు నీటిని ఉపయోగించుకోవడం ద్వారా పంటలు పండించవచ్చని సంబరపడ్డారు. అయితే ఏళ్లు గడుస్తున్నా వారి ఆశలు నెరవేరలేదు. ఇప్పటికీ ఆ కార్యం రూపుదాల్చుకోలేదు. దాదాపు దశాబ్ద కాలంగా పెండింగ్‌లోనే ఉంది. ఈ పరిస్థితి ఈ ఒక్క గ్రామానిదే కాదు.. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇలాంటివి పదుల సంఖ్యలోనే ఉన్నాయి.



ఇక్కడ కనిపిస్తున్న రైతు మేకల చిన్న గంగన్న. ఈయనది గుడిహత్నూర్ మండలం కమలాపూర్. చెరువు నిర్మాణ ప్రతిపాదిత స్థలం పక్కనే ఈ రైతుకు ఏడున్నర ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. కేవలం వర్షాధారంగానే పంటలు సాగు చేస్తుండడంతో అనేక నష్టాలను చవిచూస్తూ వస్తున్నాడు. చెరువు నిర్మాణం జరిగితే తన కష్టాలు తీరుతాయని భావించాడు. ప్రధానంగా యాసంగి సీజన్‌లో చేపట్టే పంటలకు సాగునీరు అందుతుందని అనుకున్నాడు. అయితే అది ఇప్పటివరకు సాకారం కాలేదు.

సాక్షి,ఆదిలాబాద్: బీఆర్‌ఎస్ సర్కార్ హయాంలో 2017–18లో మిషన్ కాకతీయలో భాగంగా వివిధ దశల్లో చెరువుల నిర్మాణానికి పరిపాలన అనుమతులు ఇచ్చారు. గోదావరి బేసిన్‌లో వృథా అవుతున్న నీటిని వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చిన్ననీటి పారుదల కింద ఈ చెరువులను అభివృద్ధి చేయాలని అప్పటి ప్రభుత్వం రాష్ట్రంలో మిషన్ కాకతీయ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. ఇందులో భాగంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనూ అనేక చెరువులను వివిధ దశల్లో మంజూరు చేసింది.

**భూసేకరణకు నిధులు సైతం మంజూరు**

అప్పట్లో ప్రభుత్వం చెరువుల నిర్మాణం కోసం చేపట్టిన ప్రతిపాదనలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. నీటిపారుదల, రెవెన్యూ, సర్వేల్యాండ్ శాఖల ఆధ్వర్యంలో స్థలాల పరిశీలన, ప్రభుత్వ భూములతో పాటు అవసరమైన చోట్ల రైతుల నుంచి భూములు ఎంత సేకరించాలో అనే వివరాలను పొందుపరిచి ప్రభుత్వానికి నివేదించారు. ఆ చెరువులకు సంబంధించి డిజైన్, డీపీఆర్‌లను కూడా రూపొందించారు. వ్యయం కూడా అంచనా వేశారు. వీటికి ప్రభుత్వం పరిపాలన అనుమతిస్తూ స్టేజ్–1లో నిధులు సైతం మంజూరు చేసింది. దీంతో రైతుల్లో హర్షం వ్యక్తమైంది. తమ భూములకు చెరువుల ద్వారా సాగునీరు అందుతుందన్న ఆశలు చిగురించాయి. అయితే ఏళ్లు దాటినా ఆ చెరువుల నిర్మాణంలో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. స్టేజ్–1 క్లియరెన్స్ ఇచ్చినప్పటికీ భూసేకరణలో ముందడుగు పడలేదు. అయినా స్టేజ్–2 క్లియరెన్స్ కోసం కూడా నీటిపారుదల శాఖ అధికారులు ప్రతిపాదనలు పంపారు. అవి అక్కడే ఆగిపోయాయి. తర్వాత వీటి నిర్మాణంపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఏడాది క్రితం బీఆర్‌ఎస్ ప్రభుత్వం పోయి కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చింది. ఇప్పటికైనా ఆ చెరువులకు సంబంధించి ఏదైనా పురోగతి ఉంటుందా ఆయా ప్రాంతాల రైతులు గంపెడాశతో ఎదురు చూస్తున్నారు.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఏటా అత్యధిక వర్షపాతం నమోదవుతుంది. అయితే భారీ నిధులు కేటాయించి ప్రాజెక్టులు నిర్మించలేని పరిస్థితుల్లో ఈ చెరువుల నిర్మాణాన్ని మిషన్ కాకతీయ పథకంలో భాగంగా తీసుకున్నారు.

**ప్రాజెక్టులు లేకపోయినప్పటికీ..**


ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న కొరటా–చనాఖా బ్యారేజ్, ప్రతిపాదనలో ఉన్న కుప్టి ప్రాజెక్టుల ప్రస్తావన కంటే ముందే ఈ చెరువుల నిర్మాణం తెరపై ఉంది. ప్రధానంగా వరద నీటిని ఒడిసిపట్టి చెరువుల ద్వారా రైతుల భూములకు సాగునీరు అందించాలన్న సంకల్పం మంచిదే అయినా కార్యరూపం దాల్చకపోవడమే రైతులకు ఆశనిపాతంగా మారింది. గిరిజన ప్రాంతమైన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వర్షాధారంగానే పంటలు పండించే రైతులకు ఈ చెరువుల నిర్మాణం ద్వారా సహజ పద్ధతిలో సాగునీరు అందించే ఆస్కారం ఉన్నప్పటికీ ఆ ప్రయత్నం ముందుకు పడడం లేదు. కాగా ప్రస్తుతం వేర్వేరు జిల్లాల్లో ఆయా ప్రజాప్రతినిధుల ఒత్తిడితో లిఫ్ట్ ఇరిగేషన్లు నిర్మించి నీటిని అందిస్తుండగా, అన్ని వనరులు ఉన్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో చెరువులు నిర్మించి చిన్న, సన్నకారు రైతులకు బాసటగా నిలవాలన్న అభిప్రాయం అందరిలో ఉంది.

**కేంద్రం నుంచి మంజూరు కావాల్సి ఉంది**

అప్పట్లో మిషన్ కాకతీయ పథకంలో భాగంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో చెరువుల నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు తీసుకుంది. ఆ తర్వాత ఆ ప్రణాళిక మార్చి కేంద్రానికి నివేదించింది. సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ) దృష్టికి తీసుకెళ్లింది. ప్రధాన మంత్రి క్రిషి సించాయ్ యోజన (పీఎంకేఎస్‌వై) కింద చిన్ననీటి పారుదల అభివృద్ధిలో భాగంగా ఈ చెరువులను నిర్మించాలని తలపెట్టారు. అక్కడి నుంచి మంజూరు రావాల్సి ఉంది.

– విఠల్, ఇరిగేషన్ ఈఈ, ఆదిలాబాద్

## జైనథ్ మార్కెట్‌లో గందరగోళం



ఫోన్‌పే ద్వారా డబ్బులు చెల్లించినట్లు చూపిస్తున్న గుత్తేదారు



మార్కెట్ కార్యదర్శితో వాగ్వాదానికి దిగిన గుత్తేదారు, హమాలీలు

- మధ్యాహ్నం వరకు నిలిచిన శనగ కొనుగోళ్లు
- ఆందోళనకు దిగిన హమాలీలు
- పాత వారి తొలగింపుపై ఆగ్రహం
- మార్కెట్ చైర్మన్ రూ.4లక్షలు డిమాండ్ చేశారని గుత్తేదారు ఆరోపణ
- పాత హమాలీలకే రైతుల మద్దతు

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): జైనథ్ వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం గందరగోళం నెలకొంది. హమాలీలు, మార్కెట్ కార్యదర్శి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. మధ్యాహ్నం వరకు ఆందోళన కొనసాగడంతో శనగ కొనుగోళ్లు నిలిచిపోయాయి. పోలీసులు అక్కడికి చేరుకుని వారిని సముదాయించి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. యార్డులో ఉదయం 10గంటలకు ప్రారంభం కావాల్సిన కొనుగోళ్లు ఆలస్యం కావడంతో రైతులు ఎండలోనే బారులు తీరాల్సిన పరిస్థితి. మార్కెట్ అధికారుల అలసత్వం కారణంగా ఈ వ్యవహారం రచ్చకెక్కింది. పాతవారితో తూకం సాఫీగా సాగుతున్నా కొత్త వారిని రంగంలోకి దింపడంపై ఆగ్రహం వ్యక్తమైంది.

**గొడవ ఇలా..**

బిహార్ రాష్ట్రానికి చెందిన కూలీలు కొన్నేళ్లుగా హమాలీలుగా పనిచేస్తున్నారు. వీరిని గుత్తేదారు మనోజ్ తీసుకొచ్చి ఏటా సోయా, కందులు, శనగ పంట లోడింగ్, అన్‌లోడింగ్, తూకం చేయించడం వంటి పనులు చేయిస్తున్నాడు. అయితే జైనథ్ మండలంలోని ఓ పార్టీకి చెందిన నాయకుడు లేబర్ లైసెన్స్ తీసుకుని కూలీలను సోమవారం యార్డుకు తీసుకువచ్చాడు. దీంతో బిహార్‌కు చెందిన హమాలీలు, కొత్త గుత్తేదారు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. 15ఏళ్లుగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యాన్ని వాహనాల నుంచి లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తున్నామని బిహార్‌కు చెందిన గుత్తేదారు పేర్కొన్నాడు. తమ పొట్టకొట్టి కొత్త వారిని ఎలా తీసుకుంటారని ప్రశ్నించాడు. ప్రస్తుత హమాలీలకు ముఖద్దాంగా ఉన్న తాను కొన్నేళ్లుగా కూలీలను తీసుకువచ్చి పనులు చేయిస్తున్నట్లు పేర్కొన్నాడు. మార్కెట్ కమిటీ చైర్మన్, కార్యదర్శి తనను డబ్బులు డిమాండ్ చేశారని తెలిపాడు. ఇటీవల చేపట్టిన సోయా, కందుల కొనుగోళ్ల సమయంలో మా హమాలీలు కొనసాగాలంటే రూ.4లక్షలు ఇవ్వాలంటూ డిమాండ్ చేశారని అన్నాడు. తాను అంతగా ఇవ్వలేనని రూ.1.50 లక్షలు ఇస్తానని చెప్పాడు. ఈక్రమంలో చైర్మన్ కుమారుడికి ఆన్‌లైన్ ద్వారా రూ.1.20 లక్షలు, అలాగే మరో రూ.30 వేలు నగదు అందించినట్లు పేర్కొన్నాడు.మిగతా డబ్బుల కోసమే తనను తొలగించేందుకు కుట్ర పన్నారని వాపోయాడు. మార్కెట్ కార్యదర్శి సైతం తనను డబ్బుల కోసం వేధిస్తున్నాడని ఆరోపించాడు. కాగా శనగలు విక్రయించేందుకు వచ్చిన రైతులు పాత గుత్తేదారు, హమాలీలతోనే తాము తూకం చేయించుకుంటామని వారికి మద్దతుగా నిలిచారు. కొత్త ముఖద్దాం తెచ్చిన హమాలీలతో తమ శనగలను తూకం వేయించమని భీష్మించారు. కాగా కొత్త ముఖద్దాం తాను మండలానికి చెందిన వ్యక్తి అని బిహార్‌కు చెందిన ముఖద్దాంకు కాకుండా తాను తెచ్చిన కూలీలతోనే తూకం వేయించాలని పేర్కొన్నాడు. పరిస్థితి అదుపు తప్పడంతో పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాల వారికి నచ్చజెప్పారు. మధ్యాహ్నం 2గంటల తర్వాత మార్క్‌ఫెడ్, నాఫెడ్, పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ఈ విషయమై మార్కెట్ కార్యదర్శి దేవన్నను వివరణ కోరేందుకు పలుమార్లు ఫోన్‌లో యత్నించగా స్పందించలేదు. తర్వాత ఫోన్ స్విచ్‌ఆఫ్ చేసుకున్నాడు. మార్కెట్ కమిటీ చైర్మన్ అశోక్‌రెడ్డిని ఫోన్‌లో సంప్రదించగా బిహార్ రాష్ట్రానికి చెందిన గుత్తేదారు సక్రమంగా పనులు చేపట్టడం లేదని, ఇదివరకే ఆయనను చెప్పామన్నారు. తాను డబ్బులు తీసుకున్న మాట వాస్తవం కాదని స్పష్టం చేశాడు. మార్కెట్ కమిటీ తీర్మానం చేసి ఆ గుత్తేదారుడిని తొలగిస్తామని పేర్కొన్నాడు.

## ‘కేంద్ర మంత్రితో ప్రకటన చేయించాలి’

ఆదిలాబాద్‌టౌన్: సీసీఐ పరిశ్రమ తుక్కు మాత్రమే విక్రయిస్తున్నామని, పరిశ్రమను కాదనే దానిపై కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రితో పార్లమెంట్‌లో ప్రకటన చేయించాలని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో ఎంపీ నగేశ్, మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డితో కలిసి బీజేపీ కేంద్రమంత్రులు హన్స్‌రాజ్ గంగారాం, అనంత్ గీతేలను కలిసి ఫ్యాక్టరీ పునః ప్రారంభం కోసం కృషి చేశామన్నారు. మార్చి 7న నిర్వహించాల్సిన తుక్కు విక్రయ టెండర్లను అఖిలపక్ష సమావేశాలతో నిలదీసి ఆపేలా చూశామన్నారు. రేణుక సిమెంట్ పరిశ్రమ నిర్వాసితులకు ఎకరాకు రూ.30లక్షల నుంచి రూ.40 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేసిన పాయల్ శంకర్ ఎమ్మెల్యేగా గెలిచాక వాటిని ఎందుకు ఇప్పించడం లేదని ప్రశ్నించారు. అనంతరం బీజేపీకి చెందిన భగత్ నరేశ్, రాచర్ల శరత్ ఆ పార్టీని వీడి బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి ఆయన కండువా కప్పి పార్టీలోకి స్వాగతించారు. ఇందులో విజ్జగిరి నారాయణ, అజయ్, సలీం, కుమ్ర రాజు, గణేశ్, రవి, మహేందర్, మహేశ్ పాల్గొన్నారు,

# సమస్యల ఏకరువు

- గ్రీవెన్స్‌లో అర్జీలు స్వీకరించిన కలెక్టర్
- ప్రజావాణికి 82 దరఖాస్తులు

కైలాస్‌నగర్: ఉపాధి పనులు కల్పించాలని కొందరు.. పింఛన్లు అందించాలని ఇంకొందరు.. భూసమస్య పరిష్కరించాలని మరికొందరు.. ఇలా వివిధ సమస్యలతో తరలివచ్చిన అర్జీదారులు తమ సమస్యలను అధికారులకు ఏకరువు పెట్టుకున్నారు. వాటిని పరిష్కరించేలా చూడాలని వేడుకున్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రెయినీ కలెక్టర్ అభిగ్యాన్‌తో కలిసి అర్జీలు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన బాధితుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటిని సత్వరమే పరిష్కరించేలా చొరవ చూపాలని అధికారులను ఆదేశించారు. ఈ వారం అర్జీదారుల్లో కొందరి నివేదన వారి మాటల్లోనే..



సమస్యలను ఆలకిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

**మాకు న్యాయం చేయండి**



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకంలో భాగంగా మా కుటుంబంలో నాతో పాటు ఇద్దరు అమ్మలకు అధికారులు మూడు ఇళ్లను మంజూరు చేశారు. జనవరి 26న నిర్వహించిన కార్యక్రమంలో ముగ్గురికి మంజూరు పత్రాలు కూడా అందించారు. తీరా ఇళ్ల నిర్మాణాల కోసం ముగ్గు పోయమని పంచాయతీ కార్యదర్శిని అడిగితే మీకు ఇళ్లు మంజూరు కాలేదని చెబుతున్నారు. గుడిసెల్లో నివసిస్తున్న మాకు ఇళ్లు మంజూరైన తర్వాత లేదని చెప్పడం సరికాదు. మా కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతున్నాం.

– కొడప జంగు, అందుగూడ, బజార్‌హత్నూర్



**ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయండి**

సార్ మాది నిరుపేద కుటుంబం. కూలీనాలి చేస్తే తప్ప పూటగడువదు. 44 ఏళ్లుగా గ్రామంలో నివసిస్తున్నా ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు మాకు ఎలాంటి పథకం అందలేదు. సొంత ఇంటిస్థలం కలిగి ఉన్న మాకు పక్కా ఇల్లు లేదు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తే సొంతింటి కల సాకారం చేసుకుంటాం.

– మోరె రత్నమాల, కిన్నెరపల్లి, బజార్‌హత్నూర్

**కందులు కొనుగోలు చేయాలి**

గతేడాది కందులకు క్వింటాలుకు రూ.12వేల ధర ఉండటంతో రబీ సాగులో భాగంగా జైనథ్, బేల మండలాల పరిధిలో సుమారు 1200 ఎకరాల్లో రైతులం కంది పంట సాగు చేశాం. ప్రస్తుతం పంట చేతికందుతుంది. ప్రైవేట్‌గా అమ్ముకుందామంటే రూ.5వేల నుంచి రూ.6వేలకు మాత్రమే కొంటున్నారు. దీంతో తీవ్రంగా నష్టపోయే అవకాశముంది. ప్రభుత్వ కనీస మద్దతు ధర రూ.7,560 తో మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయించి మమ్మల్ని ఆదుకోవాలి.

– జైనథ్, బేల మండల రైతులు





**నీటి ఎద్దడి తీవ్రంగా ఉంది..**

అయ్యా మా గ్రామంలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉంది. మొత్తం 1500 మంది జనాభా ఉండగా ఒకే ఒక్క చేతిపంపు ఉంది. ప్రస్తుతం భూగర్భ జలాలు అడుగంటి అది కూడా పనిచేయడం లేదు. దీంతో తాగునీరు దొరకని పరిస్థితి. ఏటా నీటి ఎద్దడి తీవ్రంగా ఉండటంతో మా గ్రామంలోని యువకులకు పెళ్లిళ్లు చెద్దామంటే పిల్లను ఇవ్వడం లేదు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. గ్రామంలో భూగర్భజలాలు పెరిగేలా ఓ చెరువు మంజూరు చేసి నీటి సమస్య దూరం చేయాలని కోరుతున్నాం.

– సుంగాపూర్ గ్రామస్తులు, నార్నూర్

**అప్లికేషన్ తీసుకోవట్లేదు..**



అయ్యా మాది నిరుపేద కుటుంబం. నా భర్త ప్రేంసాగర్ తాపీ మేస్త్రీ. పనులు లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. మాకు ముగ్గురు పిల్లలు. వారిని గురుకులంలో చేర్పించేందుకు క్యాస్ట్, ఇన్‌కం సర్టిఫికెట్ అడుగుతున్నారు. వాటి కోసం దరఖాస్తు చేసుకునేందుకు మీసేవ కేంద్రాలకు వెళితే రేషన్‌కార్డులో పిల్లల పేర్లు లేవనే కారణంతో దరఖాస్తు చేయడం లేదు. దీంతో మా పిల్లలు చదువుకు దూరమయ్యే పరిస్థితి ఉంది. సర్టిఫికెట్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకుని ఆదుకోవాలని కోరుతున్నాం.

– ఆర్.సుమలత, ఖానాపూర్, ఆదిలాబాద్

## ఏఐతో అభ్యసన సామర్థ్యాల పెంపు

- కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్‌టౌన్: ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ) పరిజ్ఞానంతో విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు మెరుగుపడనున్నాయని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. భోరజ్ మండలంలోని పిప్పర్‌వాడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏఐ విద్యాబోధన కార్యక్రమాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. అనంతరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న హెల్త్ కార్నర్‌ను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు విజయోత్సవ లేఖలతో పాటు హాల్‌టికెట్లు అందజేసి ఆల్‌ది బెస్ట్ చెప్పారు. ఇందులో డీఈవో ప్రణీత, హెచ్ఎం శశికళ, నవనీత, తహసీల్దార్ రాజేశ్వరి, ఎంపీడీవో వేణు, ఎంఈవో శ్రీనివాస్, ప్రశాంత్ రెడ్డి, సంతోష్‌రెడ్డి, యువనేస్తం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

**వేసవిలో అప్రమత్తంగా ఉండాలి**

కైలాస్‌నగర్: ఈ ఏడాది ఎండల తీవ్రత ఎక్కువగా ఉందని, భానుడి ప్రతాపం రోజురోజుకు పెరుగుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వేసవిలో హీట్ వేవ్- 2025 సమ్మర్ యాక్షన్ ప్లాన్ ఖరారుపై సంబంధిత శాఖల అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వడగాలులతో జరిగే నష్టాలను నియంత్రించేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. మధ్యాహ్నం 12నుంచి సాయంత్రం 4గంటల వరకు అత్యవసరమైతే తప్ప ప్రజలెవరూ బయటకు రావద్దని సూచించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడటంతో పాటు ఉపాధి హామీ పనుల వద్ద తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రెయినీ కలెక్టర్ అభిగ్యాన్, జిల్లా అటవీశాఖ అధికారి ప్రశాంత్ బాజీరావ్ పాటిల్, ఆర్డీవో వినోద్ కుమార్, డీఈవో ప్రణీత, డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్ పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల ఆందోళన



ధర్నాలో పాల్గొన్న అంగన్‌వాడీలు

కైలాస్‌నగర్: ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసే పీఎంశ్రీ పథకం, మొబైల్ అంగన్‌వాడీ కేంద్రాలను రద్దు చేయాలనే డిమాండ్‌తో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేపట్టారు. కలెక్టరేట్ ఎదుట 48గంటల మహాధర్నా కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన అంగన్‌వాడీలు, ఆయాలు కలెక్టరేట్ ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, కేంద్రం తెచ్చిన నూతన జాతీయ విద్యావిధానం అమలైతే అంగన్‌వాడీ కేంద్రాల మనుగడే ఉండదన్నారు. ఈ చట్టాన్ని నిలిపివేసేలా కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ లో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. రాత్రి అక్కడే వంటావార్పు నిర్వహించిన అంగన్‌వాడీలు నిరసన శిబిరంలోనే నిద్రించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సునీత, జయలక్ష్మి, మంగ, వెంకటమ్మ, పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం


వ్యక్తి మృతదేహం

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని అందుగులపేట జాతీయ రహదారి ఫ్లై ఓవర్‌బ్రిడ్జి ముగింపు సమీపంలో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ల భ్యమైనట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. మృతుడి ఒంటిపై నీలిరంగు చొక్కా, జీన్స్ ప్యాంట్ ఉన్నాయని, ప్యాంటు జేబులో ఆదివారం మధ్యాహ్నం బెల్లంపల్లి నుంచి మంచిర్యాల వైపు వెళ్లే పల్లె వెలుగు బస్సు టికెట్ లభించిందని తెలిపారు. మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో మార్చురీలో భద్రపర్చామని పేర్కొన్నారు. మృతుడి వివరాలు తెలిసినవారు 8712656570 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

### నిర్మల్‌లో మేకల అపహరణ

నిర్మల్ టౌన్: జిల్లా కేంద్రంలోని వెంకటాపూర్ కాలనీలో కొన్ని రోజులుగా మేకలు చోరీ అవుతున్నాయి. ఈనెల 15న కాలనీవాసి భీమన్నకు చెందిన రూ.45 వేల విలువ చేసే నాలుగు మేకపోతులను దొంగలు ఎత్తుకెళ్లారు. గత నెలలో శాంతినగర్ కాలనీలోని అనిల్‌కు చెందిన మేకల మంద నుంచి నాలుగు మేకలను అపహరించుకుపోయారు. వరుసగా దొంగలు మేకలను అపహరిస్తుండడంతో కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా దొంగలను పట్టుకోవడం లేదని పేర్కొన్నారు.

### అనారోగ్య కారణాలతో ఒకరి ఆత్మహత్య

భైంసారూరల్: మండలంలోని దేగాం గ్రామానికి చెందిన జెజ్జరి సాయినాథ్(50) అనారోగ్య కారణాలతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ నైలు తెలిపారు. సాయినాథ్ కొన్ని రోజులుగా కడుపునొప్పి, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ప్రతీ రోజుమాదిరిగానే ఆదివారం రాత్రి కుటుంబీకులతో భోజనం చేసి పడుకున్న తర్వాత సాయినాథ్ గ్రామ సమీపంలోని పద్మశాలి సంఘ భవనం స్లాబ్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

### రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

నర్సాపూర్(జి): మండలంలోని నసీరాబాద్ గ్రామ సమీపం 61వ జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం రోడ్డు ప్రమాదం జరిగింది. ఏఎస్సై శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన గుండోజి నాగార్జున, శ్రీరామ్ వెంకటరమణ, నిర్మల్‌కు చెందిన నగేశ్ ద్విచక్ర వాహనంపై రాంపూర్ గ్రామానికి వెళ్తుండగా.. నందన్ గ్రామానికి చెందిన కూన కల్యాణ్ ద్విచక్ర వాహనంపై నిర్మల్ నుంచి నందన్ గ్రామం వైపు వస్తుండగా నసీరాబాద్ గ్రామ సమీపంలో ఎదురుగా ఢీకొన్నారు. ఈ ఘటనలో నాగార్జున, వెంకటరమణ కుడికాలు విరిగింది. నగేష్, కూన కల్యాణ్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను గ్రామస్తులు 108లో నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వెంకటరమణ బావ దర్వసువారు ప్రకాశ్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.



# తలరాతను మార్చేది చేతిరాతే

'మంచి చేతిరాత లేకపోతే చదువు పూర్తి కానట్లే. పెదవులపై చిరునవ్వు లేనిదే మేకప్ పూర్తి కాదు'
– 'సత్యశోధన'లో మహాత్మాగాంధీ

- అందమైన రాత.. భవితకు బాట
- విద్యార్థులకు అవగాహన తప్పనిసరి
- అధిక మార్కుల సాధనకు ఉపయోగం
- పోషకులు దృష్టి సారించాలి

కెరమెరి(ఆసిఫాబాద్): అక్షరం విలువ తెలపడానికి.. మన భావాల్ని స్పష్టంగా వ్యక్తం చేయడానికి అందమైన దస్తూరి అవసరం. కానీ సాంకేతిక పుణ్యమా అని..ఆయుధం లాంటి అక్షరం అష్టవంకర్లు పోతోంది. 'నేను క్షేమం.. మీరు క్షేమమా'అంటూ రాసే లేఖలు మాయమయ్యాయి. హలో.. హాయ్ అంటూ సంక్షిప్త సందేశాలు గిర్రున తిరుగుతున్నాయి. కంప్యూటర్లు, ట్యాబ్, మొబైల్‌ల కారణంగా కాగితంపై పెన్ను పెట్టాల్సిన అవసరం లేకుండా పోతోంది. ఈ తరుణంలో ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే పాఠశాలల్లో చదివే సగం మంది విద్యార్థులు చేతిరాత గుండ్రంగా రాయలేక పోతున్నారు. ఫలితంగా మంచి మార్కులు పొందలేక పోతున్నారు. ఇప్పటికే ఇంటర్ పరీక్షలు ప్రారంభం కాగా ఈ నెల 21 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. చేతిరాత బాగుంటే పరీక్షల్లో విద్యార్థులు మంచి గ్రేడులు సాధించే అవకాశం లేకపోలేదు. ఈ నేపథ్యంలో నిపుణుల సూచనలు, ప్రస్తుత పోటీ ప్రపంచంలో చేతిరాత భవిష్యత్‌కు సోపానంలా ఉపయోగపడేందుకు అవసరమైన నియమాలు, సూచనలు.

**దోషాలు**

చిన్న చిన్న దోషాలే విలువైన మార్కులకు కోత పెడతాయన్న విషయాన్ని ప్రతీ ఒక్కరు గుర్తించాలి. సాధారణ విద్యార్థులు పరీక్షల్లో నాలుగు రకాల తప్పులు చేస్తుంటారు. అవి మార్కులకు తగ్గట్టు సమాధానాలు రాయక పోవడం, వ్యాకరణ దోషాలు, అక్షర దోషాలు, చేతిరాత గజిబిజిగా ఉండడం. ఇందులో ఎక్కువగా మార్కులకు గండి కొట్టేది దస్తూరి అని నిపుణులు పేర్కొంటున్నారు.

- ప్రశ్నలకు సమాధానం రాసేటప్పుడు విరామ చిహ్నాలు మర్చిపోతుంటారు.
- అక్షరాల ఖాళీ స్థలాన్ని వదులుతారు.
- అక్షరాలు, సంఖ్యలను స్పష్టంగా రాయడం.
- కాగితంపై పెన్ను ఒత్తిపట్టి రాస్తే ఒత్తిడి స్పష్టంగా కనిపిస్తుంది.
- కొట్టి వేతలు మనం పరీక్షకు సన్నద్ధం కాలేదని చెబుతాయి.
- ఏ4 సైజ్ కాగితంలో 20 నుంచి 25 వరుసలు రాస్తుంటారు.
- లైన్లు వంకర టింకరగా ఉంటాయి
- బొమ్మల్లో భాగాలను సరిగా గుర్తించరు.
- పదాల్ని కలిపేసి రాస్తుంటారు.
- కలాన్ని ఇష్టం వచ్చినట్లుగా పట్టుకోవడంతో చేతిరాత గజిబిజిగా ఉంటుంది.
- ఎర్ర రంగు సిరా కలాన్ని ఉపయోగిస్తారు.
- ఇలాంటివి చేయకపోవడం వల్ల అధిక మార్కులు పొందే అవకాశం ఉంది.


తెలుగురాతపై సాధన చేస్తున్న గోయగాం ఉన్నత పాఠశాల విద్యార్థినులు

**ఉపయోగాలు**

- చేతిరాత అందంగా ఉంటే పరీక్షల్లో మార్కుల సాధనలో ముందున్నట్లే.
- ఉపాధ్యాయుల ప్రశంసలు పొందాలన్నా, ఉద్యోగం చేసే చోట యజమాని మెప్పు పొందాలన్నా అందమైన రాత కీలకం.
- ఉద్యోగ సంబంధ నోటిఫికేషన్లు స్వదస్తూరితో నింపిన దరఖాస్తులను మాత్రమే పంపాలని నిబంధన ఉందంటే చేతిరాత ప్రాముఖ్యత ఎంతగా ఉందో అవగతమవుతోంది.
- ప్రధానంగా మానవ వనరుల విభాగం బహుళజాతి సంస్థలు, ఉద్యోగ నియామకాల్లో చేతిరాతను కూడా ప్రాతిపదికగా తీసుకుంటారు.
- మనసులో అలజడులు చేతిరాతతో ప్రతిఫలిస్తాయి. కనుకనే మానసిక వైద్యశాస్త్రంలో చేతిరాతకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇటీవలి కాలంలో చేతిరాతను బట్టి, మనస్తత్వాన్ని బట్టి అంచన వేసే గ్రాఫాలజి శాస్త్రాలు అందుబాటులోకి వచ్చాయి.
- చేతిరాతతో ఒక వ్యక్తిలోని 200 విషయాలను తెలుసుకోవచ్చని లిపి నిపుణులు పేర్కొంటున్నారు.

### నైపుణ్యం అలవర్చుకోవాలి



రాసేటప్పుడు కూర్చునే భంగిమ, కలం పట్టుకునే విధానం, పుస్తక స్థాన విధానం, చేతిరాతపై ప్రభావం చూపుతాయి. బాల్‌పాయింట్ పెన్నుకన్నా సిరాపెన్నుతో చేతిరాత అందంగా వస్తుంది. సున్న, అరసున్న తెలుపు గీతలను బాగా సాధన చేయాలి. ఆంగ్లం, తెలుగు, చూచిరాత మెరుగుదల కోసం అపసవ్య దశలో రాసే నైపుణ్యం అలవర్చుకోవాలి. హింది రాత మెరుగుకోసం సవ్య దశలో రాయడం అలవాటు చేసుకోవాలి. చేతిరాతపై పిల్లలతో పాటు పెద్దలు దృష్టి సారించాలి.

– పెందోర్ జైవంతా, తెలుగు పండితురాలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గోయగాం

### సాధన చేస్తున్నా



చక్కటి చేతిరాతపై సాధన చేస్తున్నా. ప్రతీరోజు తెలుగు, హింది, ఆంగ్లం చూచిరాత రాస్తున్నా. రాత పద్ధతులపై టీచర్ బాగా చెబుతున్నారు. పరీక్షల్లో గ్రేడులు అధికంగా సాధించేందుకు ఎంతో ఉపయోగపడుతుంది. పేపర్ దిద్దేవారికి కూడా ఎంతో సులభమవుతుంది. అందమైన రాత విద్యార్థి క్రమశిక్షణను తెలియజేస్తుంది. ప్రతీ విద్యార్థి చేతిరాతపై ప్రాక్టీసు చేయాలి.

– మోహర్లే జయ, 9వ తరగతి, గోయగాం

### హాస్టల్ వెల్ఫేర్ ఉద్యోగానికి ఎంపిక


మార రజినీకాంత్‌రెడ్డి


పటాన్ సిరాజ్‌ఖాన్

బోథ్: మండలంలోని ధన్నూర్(బి) గ్రామానికి చెందిన మార రజినీకాంత్ రెడ్డి సోమవారం హాస్టల్ వెల్ఫేర్ అధికారి ఉద్యోగానికి ఎంపికయ్యారు. గతంలో తెలంగాణ ఉద్యమ సమయంలో సిటీ బస్‌కండక్టర్ ఉద్యోగానికి ఆయన రాజీనామా చేశారు. కాగా హాస్టల్ వెల్ఫేర్ ఉద్యోగానికి ఎంపిక కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**సత్తా చాటిన సిరాజ్‌ఖాన్**

బజార్‌హత్నూర్: టీజీపీఎస్సీ సోమవారం విడుదల చేసిన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఫలితాల్లో మండలంలోని కొలారి గ్రామానికి చెందిన పటాన్ సిరాజ్‌ఖాన్ సత్తా చాటాడు. రైతు పటాన్ అంజత్‌ఖాన్, షకీలాబేగంల కుమారుడు సిరాజ్‌ఖాన్ రాష్ట్ర స్థాయిలో 5వ ర్యాంకు సాధించాడు.

### ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నెన్నెల: ఆదిల్‌పేట కాలువ నుంచి మందమర్రి మండలం మామిడిగట్టుకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. డ్రైవర్ మోహన్‌ను అదుపులోకి తీసుకొని ట్రాక్టర్‌ను నెన్నెల పోలీస్‌స్టేషన్‌కు తరలించి తహసీల్దార్‌కు అప్పగించామని పేర్కొన్నారు. డ్రైవర్‌తోపాటు ట్రాక్టర్ యజమాని మోర్లె మల్లేష్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మండలంలోని వాగుల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

## సైకిల్ పై నుంచి పడి వ్యక్తి మృతి


మృతుడు రాజయ్య

కాసిపేట: మండలంలోని దేవాపూర్ మద్దిమాడ శివారులో సైకిల్ పై నుంచి కిందపడి ఓరియంట్ రిటైర్డ్ లోడింగ్ కార్మికుడు గాసికంటి రాజయ్య (65) మృతిచెందాడు. దేవాపూర్ ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. హాజీపూర్ మండలం సబ్బపల్లికి చెందిన రిటైర్డ్ లోడింగ్ కార్మికుడు రాజయ్య ఈ నెల 16న దేవాపూర్‌లోని తన కుమారుడు మల్లేష్ ఇంటికి వెళ్లాడు. సాయంత్రం 5గంటలకు తన స్నేహితుడిని కలవడానికి కొత్త గడ్పూర్‌కు వెళ్లి తిరిగి ఏడు గంటల ప్రాంతంలో కుమారుడి ఇంటికి బయల్దేరాడు. మార్గమధ్యంలో మద్దిమాడ శివారులోని కల్వర్టు వద్ద సైకిల్ పై నుంచి ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. అంబులెన్స్‌లో బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

## చెరువులోపడి ఒకరు మృతి


మృతుడు సుంకరి శ్రీనివాస్

నర్సాపూర్(జి): కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందిన ఘటన మండలంలని చర్లపల్లిలో సోమవారం జరిగింది. ఏఎస్సై శంకర్ తెలిపిన వివరాల ప్రకారం... రాంపూర్ అనుబంధ గ్రామం చర్లపల్లికి చెందిన సుంకరి శ్రీనివాస్(45) సోమవారం తెల్లవారుజామున కాలకృత్యాలకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి గ్రామ శివారులోని ఊర చెరువు వద్దకు వెళ్లాడు. ఉదయం 9 గంటలైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చెరువు వద్దకు వెళ్లి వెతకగా ఒడ్డుపై శ్రీనివాస్ చెప్పులు కనిపించాయి. వెంటనే ఈతగాళ్లతో చెరువులో గాలించగా శ్రీనివాస్ మృతదేహం లభించింది. ప్రమాదవశాత్తు చెరువుల పడి మృతిచెందాడని శ్రీనివాస్ భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### విద్యుదాఘాతంతో రైతు మృతి

కుభీర్: నిర్మల్ జిల్లా కుభీర్ మండలం సిర్పెల్లి గ్రామానికి చెందిన పబ్బు గణేశ్(48) తన చేనులో విద్యుత్‌షాక్‌తో మృతిచెందాడు. ఎస్సై పి.రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. గణేశ్ తనకున్న 12 ఎకరాల్లో రెండెకరాలు మొక్కజొన్న సాగుచేశాడు. చేనుకు నీరు పెట్టేందుకు సోమవారం ఉదయం 10 గంటలకు వెళ్లాడు. మధ్యాహ్నం అయినా ఇంటికి రాకపోవడంతో కొడుకు సంజయ్ 1 గంటకు చేను వద్దకు వెళ్లాడు. అయితే అప్పటికే గణేశ్ మరణించి ఉన్నాడు. మోటార్ ఆన్ చేసే సమయంలో విద్యుత్ షాక్‌తో మరణించినట్లు గుర్తించిన అజయ్ వెంటనే కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించాడు. కుటుంబ సభ్యులు గణేశ్‌ను విగత జీవిగా చూసి కన్నీరుమున్నీరయ్యారు. పోలీసులు వివరాలు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. గణేశ్‌కు భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. అజయ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### పేకాట ఆడుతున్న ఆరుగురి అరెస్టు

బెల్లంపల్లి: మండలంలోని లంబాడితండా గ్రామ శివారులో పేకాట స్థావరంపై తాళ్ల గురిజాల పోలీసులు సోమవారం దాడి చేశారు. తాళ్ల గురిజాల ఎస్సై రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. లంబాడితండా గ్రామ శివారులో కొందరు పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడి చేశారు. బుధాకలాన్ గ్రామానికి చెందిన నిధుల రమేష్, ఎండల రమేష్, రాందేని రవి, దాడి మల్లేష్, ఆవునూరి గోపి, బోయిన రవిలను అదుపులోకి తీసుకున్నారు. మరో ముగ్గురు దుర్గం రాజేష్, రాసకొండ తిరుపతి, ఆవునూరి శ్రావణ్ పారిపోయారని ఎస్సై ప్రకటించారు. నిందితుల నుంచి రూ.3,630, ఆటో, బైక్ స్వాధీనం చేసుకున్నామని, కేసు దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు.

## సికిల్‌సెల్ నిర్మూలనే లక్ష్యం


అధికారులతో రాష్ట్ర ప్రోగ్రాం అధికారి హీన దీక్షిత్

ఆదిలాబాద్‌టౌన్: సికిల్‌సెల్ నిర్మూలనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని బ్లడ్ సెల్ రాష్ట్ర ప్రోగ్రాం అధికారి డాక్టర్ హీన దీక్షిత్ అన్నారు. డీఎంహెచ్‌వో సమావేశ మందిరంలో సికిల్‌సెల్‌పై జిల్లా స్థాయి టీవోటీ శిక్షణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో 2047 వరకు సికిల్‌సెల్ (ఎనీవియా) అంతం చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని తెలిపారు. సికిల్‌సెల్ ఏ విధంగా వ్యాప్తి చెందుతుంది, దాన్ని ఎలా అరికట్టాలో మాస్టర్ ట్రైనర్ హెమటలాజీ ప్రొఫెసర్ రాధిక ప్రొజెక్టర్ ద్వారా మెడికల్ ఆఫీసర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ ప్రొగ్రామ్ అధికారి శ్రీధర్, ఏటీడీవో అనిల్, మెడికల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

## మట్కా నిర్వహిస్తున్న మహిళా గ్యాంగ్ అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలో మట్కా జూదం నిర్వహిస్తున్న మహిళా గ్యాంగ్‌ను టూటౌన్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. సీఐ కరుణాకర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంద్రానగర్‌లో మట్కా ఆడుతున్నారనే సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. ఈ క్రమంలో అదే కాలనీకి చెందిన షేక్ ఖలీల్, షేక్ రంజానీ, పర్జానా, షబానా, రిజ్వానా, మలేక బీలు మట్కా నిర్వహిస్తున్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన నల్ల కేశవ్, గాంధీనగర్‌కు చెందిన కాంబ్లే బాబు షా డబ్బులు పెట్టి మట్కా ఆడుతున్నట్లుగా గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు. వారి నుంచి రూ.2,260 నగదుతో పాటు మట్కా చిటీలు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. పట్టుబడిన వారిని స్టేషన్‌కు తరలించే క్రమంలో పర్జానా తాను స్టేషన్‌కు రానని, తనను తీసుకెళితే బ్లేడ్‌తో గొంతు కోసుకుంటానని అనడంతో సదరు మహిళపై మట్కా కేసుతో పాటు మరో కేసు నమోదు చేసినట్లుగా సీఐ వివరించారు.

నిర్మల్ టౌన్: ఒకరిని చంపడానికి ప్రయత్నించిన వ్యక్తికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ.. నిర్మల్ న్యాయస్థానం తీర్పునిచ్చింది. కోర్టు సమన్వయ అధికారి డల్లు సింగ్ తెలిపిన విరాల ప్రకారం.. తానూరు మండలం బోసి గ్రామానికి చెందిన రఘునాథ్ వ్యవసాయం చేస్తూ.. జీవనం సాగిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన విఠల్ రఘునాథ్ కు చిన్ననాటి స్నేహితుడు. రెండేళ్ల క్రితం విఠల్ భార్య లక్ష్మి బామినీ గ్రామానికి వెళ్లడానికి గ్రామంలోని శివ మందిర్ వద్ద నిలబడి ఉంది. అదే సమయంలో రఘునాథ్ మహలింగి గ్రామానికి మోటార్ సైకిల్‌పై వెళ్తున్నాడు. లక్ష్మి ముందు నుంచి వెళ్తున్న రఘునాథ్‌ను ఆపి తనను బామినీ ఎక్స్ రోడ్ వద్ద దింపేయాలని కోరింది. ఈ మేరకు రఘునాథ్ ఆమెను బైక్‌పై ఎక్కించుకొని దింపేశాడు. ఈ విషయంపై లక్ష్మీ భర్త విఠల్ కోపం 2024, అక్టోబర్ 24న రఘునాథ్ గ్రామ శివారులో బహిర్భూమికి వెళ్లి వస్తుండగా గొడ్డలితో తల మీద కొట్టి, చంపాలని ప్రయత్నం చేశాడు. అక్కడే ఉన్న రాజేశ్వర్ , హన్మాండ్లు అడ్డుకోగా.. విఠల్ పారిపోయాడు. రఘునాథ్‌కు గాయాలు కావడంతో భైంసా ఆసుపత్రికి తీసుకెళ్లారు. మెరుగైన చికిత్స కొరకు హైదరాబాద్ నిమ్స్‌కు తీసుకెళ్లారు. రఘునాథ్ భార్య జ్యోతి తానూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయంతో కేసు నమోదు చేసి, విచారణ చేపట్టి, చార్జిషీట్ దాఖలు చేసి, నిందితుడిని కోర్టులో ప్రవేశపెట్టారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ కల్వకుంట్ల వినోద్‌రావు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి, నేరం రుజువు చేశారు. ఈ మేరకు జిల్లా సెషన్స్ జడ్జి విఠల్‌కు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.2 వేల జరిమాన విధిస్తూ.. సోమవారం తీర్పు చెప్పారు.

## హత్యాయత్నం కేసులో ఒకరికి జైలు

**దాడి చేసిన ఆరుగురికి..**

నిర్మల్ టౌన్:ఓ వ్యక్తిపై కర్రలతో దాడికి దిగిన పలువురికి నిర్మల్ న్యాయస్థానం జైలు శిక్ష, జరిమానా విధిస్తూ.. తీర్పు ఇచ్చింది. జిల్లా కేంద్రంలోని వెంకటాపూర్ కాలనీకి చెందిన లింగన్న తన భార్యతో గొడవపడి వేరుగా ఉంటున్నాడు. తర్వాత జిల్లా కేంద్రానికి చెందిన రజితతో పరిచయం ఏర్పడడంతో స్థానిక సోఫీ నగర్‌లో ఇంటిని అద్దెకు తీసుకుని సహజీవనం చేస్తున్నారు. 2019 అక్టోబర్ 9న సాయంత్రం 5 గంటల సమయంలో లింగన్న రజిత ఇంట్లో ఉండగా.. లింగన్న భార్య లావణ్య, ఐదుగురు బంధువులతో కలిసి కర్రలతో దాడిచేశారు. ఈ విషయంపై రజిత నిర్మల్ పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు చార్జిషీట్ దాఖలు చేసి, విచారణ చేపట్టి, కోర్టులో ప్రవేశపెట్టారు. సోమవారం నిర్మల్ న్యాయస్థానం లావణ్య, ఆమె ఐదుగురు బంధువులకు ఆరు నెలల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పింది.

**గంజాయి సాగు చేసిన వ్యక్తికి..**

ఆసిఫాబాద్అర్బన్: గంజాయి సాగు చేసిన వ్యక్తికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.30వేల జరిమానా విధిస్తూ ఆసిఫాబాద్ జిల్లా సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ.రమేష్ సోమవారం తీర్పునిచ్చారు. సిర్పూర్(యూ) ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. సిర్పూర్(యూ) పోలీసుస్టేషన్ పరిధిలోని మధురతాండ గ్రామ శివారులో కట్కవార్ రావుసింగ్ తన పత్తి చేనులో గంజాయి సాగు చేస్తున్నాడన్న సమాచారం మేరకు 2021 అక్టోబర్ 24న అప్పటి ఎస్సై విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. లాభాపేక్షతో పత్తి పంటలో గంజాయి సాగు చేస్తున్నట్లు తేలింది. కేసు నమోదు చేసి సాక్షులను కోర్టులో హాజరుపర్చగా నేరం రుజువైంది. నిందితుడికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పీపీ జగన్‌మోహన్‌రావు, ఏఎస్పీ చిత్తరంజన్, జైనూర్ సీఐ రమేష్, సిర్పూర్ ఎస్సై రామకృష్ణ, కోర్టు ఆసిఫాబాద్ డివిజన్ లైజనింగ్ అధికారి రాంసింగ్‌ను ఎస్పీ డీవీ.శ్రీనివాస్‌రావు అభినందించారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థుల దుర్మరణం

- మరొకరికి తీవ్ర గాయాలు
- మృతుల్లో చెన్నూర్ మండల వాసి
- హన్మకొండ జిల్లాలో ఘటన
- దైవదర్శనానికి వెళ్తుండగా ప్రమాదం


సుశాంత్ (ఫైల్)

హసన్‌పర్తి: దైవదర్శనానికి వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఇద్దరు విద్యార్థులు దుర్మరణం చెందారు. మరో విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన ఆదివారం అర్ధరాత్రి హన్మకొండ జిల్లా పరకాల–కిట్స్ కళాశాల ప్రధాన రహదారిలోని ముచ్చర్ల క్రాస్ సమీపంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. నగరంలోని ఖిలా వరంగల్ తూర్పుకోటకు చెందిన మేకల సుశాంత్ (19), మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలం పొక్కూరు గ్రామానికి చెందిన తాండ్ర విజయ్(19), జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం జైనా గ్రామానికి చెందిన సి.వర్ధన్(18) స్నేహితులు. సుశాంత్ పరకాలలోని పాలిటెక్నిక్‌లో థర్డ్ ఇయర్ చదువుతుండగా, వర్ధన్ అదే కళాశాలలో పాలిటెక్నిక్ సెకండ్ ఇయర్ అభ్యసిస్తున్నాడు. విజయ్ పరకాలలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సెకండియర్ చదువుతున్నాడు. వీరు ముగ్గురు అదే ప్రాంతంలోని బీసీ హాస్టల్‌లో ఉంటూ చదువు కొనసాగిస్తున్నారు.

**హాస్టల్ నుంచి జాతరకు..**

ఆదివారం రాత్రి 9.30గంటలకు సుశాంత్, విజయ్, సి.వర్ధన్ పరకాల నుంచి బైక్‌పై ఎర్రగట్టు జాతరకు బయలుదేరారు. సుశాంత్ బైక్ నడుపుతుండగా, విజయ్, వర్ధన్ వెనుక కూర్చున్నారు. వీరితోపాటు మరికొంత మంది విద్యార్థులు కూడా వారి వెంట తమతమ బైక్‌లపై జారతకు పయనమయ్యారు. సుశాంత్ నడుపుతున్న బైక్‌ను ముచ్చర్ల శివారులోని జాతీయ రహదారి నిర్మాణ పనులు చేపడుతున్న ప్రాంతానికి చేరుకోగానే ఓ గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని వెనుకాల బైక్‌పై వస్తున్న స్నేహితులు 108లో ఎంజీఎంకు తరలించారు. అప్పటికే సుశాంత్ మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. చికిత్స పొందుతూ విజయ్ సోమవారం తెల్లవారు ప్రాణాలు వదిలాడు. వర్ధన్ పరిస్థితి విషమంగా ఉండడంతో నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. మృతుడు సుశాంత్ తండ్రి సురేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దేవేందర్ తెలిపారు.

### అడవిపంది దాడిలో యువరైతుకు గాయాలు

దిలావర్‌పూర్:మండలంలోని కాల్వ తండాకు చెందిన యువ రైతు జాదవ్ నరేష్‌పై సోమవారం అడవిపంది దాడిచేసింది. మొక్కజొన్న, వరి పంటకు నీరు పెట్టేందుకు వెళ్లాడు. అప్పటికే తోటలో పందుల గుంపు పడింది. గమనించిన అతడు పంటను కాపాడేందుకు కేకలు వేస్తూ పరుగెత్తాడు. ఓ పంది అతడిపై దాడిచేసింది. ఈ ఘటనలో కాళ్లకు గాయాలయ్యాయి. నరేశ్ అరుపులు విని సమీపంలోని చేలలో ఉన్న రైతులు పరిగెత్తుకుంటూ రావడంతో పందులు పారిపోయాయి. బాధితుడిని ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కాల్వతండా రైతులు అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు.

## దోపిడీ దొంగల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ ప్రకాష్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని మ్యాక్స్ భవన్ వద్ద ఈ నెల 14 దోపిడీకి పాల్పడిన ఇద్దరు దొంగలను సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాష్ తెలిపారు. సంబంధిత వివరాలను ఆయన కార్యాలయంలో వెల్లడించారు. స్థానిక బెల్లంపల్లి చౌరస్తాలో నివాసం ఉంటున్న ప్రభుత్వ ఉద్యోగి ప్యాగ పోశంపై దాడి చేసి ఆయన వద్ద ఉన్న బంగారు గొలుసును దోచుకున్నారని తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ప్రత్యేక పోలీస్ బృందాన్ని ఏర్పాటు చేశామని, సీసీ పుటేజీ ఆధారంగా బండి నంబర్‌ను గుర్తించి దోపిడీకి పాల్పడిన దొంగలను గుర్తించామని తెలిపారు. స్థానిక సంజీవయ్య కాలనికి చెందిన ఎండీ.సమీర్, ఎండీ.జుబీర్‌లను అరెస్ట్ చేసి విచారించగా నేరం అంగీకరించారని తెలిపారు. నిందితుల నుంచి బంగారు గొలుసు, కత్తి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితులను పట్టుకున్న సీఐ ప్రమోద్‌రావు, ఎస్సై ప్రవీణ్‌కుమార్, సిబ్బంది సుబ్బారావ్, మహేష్, ఉపేందర్‌లను డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాష్ అభినందించారు.

## తొలికాత విద్యార్థులకే..

- పాఠశాలలో ఏటా పుచ్చకాయలు అందజేస్తున్న రైతు ఆనంద్


పుచ్చకాయలను చూపుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు, రైతు ఆనంద్

ఆ రైతుకు పిల్లలంటే ఎనలేని ప్రేమ. వారిని దైవంగా భావిస్తాడు. ఏటా తన చేనులో సాగైన పుచ్చకాయల తొలికాతను వారికే అందజేస్తాడు. ఐదేళ్లుగా ఇదే ఆనవాయితీ కొనసాగిస్తున్నాడు. అతడే తాంసి మండలం పొన్నారి గ్రామానికి చెందిన రైతు అండె ఆనంద్. తనకున్న రెండెకరాల్లో ఏటా పుచ్చ సాగు చేస్తున్నాడు. దిగుబడి షురూ అయ్యే క్రమంలో తొలికాతను గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఐదేళ్లుగా అందజేస్తున్నాడు. ఇందులో భాగంగా సోమవారం స్థానిక ప్రాథమిక, జెడ్పీ పాఠశాలలోని 200 మంది విద్యార్థులకు అందజేశాడు. ఇందులో మాజీ సర్పంచ్ అశోక్, మాజీ ఎంపీటీసీ రఘు, ఉపాధ్యాయులు సరిత,శిల్ప సిబ్బంది ఉన్నారు. – తాంసి